# 40

# పులిసిన పిండిని గూర్చి జాగ్రతపడుడి

## (16:5-12)

యేసు గలిలయ సముద్రమును దాటి, బేత్సయిదా చేరుకొనిన తరువాత తన శిష్యులకు మరొక పర్యాయము బోధింప నారంభించారు.

### యేసు హెచ్చరిక (16:5, 6)

**[5]ఆయన శిష్యులు అద్దరికి వచ్చి రొట్టెలు తెచ్చుటకు మరచిరి. [6]అప్పుడు యేసు చూచుకొనుడి, పరిసయ్యులు సద్దూకయ్యులు అను వారి పులిసిన పిండినిగూర్చి జాగ్రత పడుడని వారితో చెప్పెను.**

**వచనము 5.** వారడిగిన సూచక క్రియ గూర్చి యేసు పరిసయ్యులు మరియు సద్దూకయ్యులతో చర్చించిన తరువాత, **ఆయన శిష్యులు** మగదాను ప్రాంతము నుండి (15:39) **సముద్రపుటద్దరికి** యేసుతో కూడ వచ్చారు. వారు బేత్సయిదా (మార్కు 8:22) ప్రాంతమునకు వచ్చారు. **వారు రొట్టెలు తెచ్చుటకు మరచిరి,** దోనెలో వారి యొద్ద ఒకే ఒక్క రొట్టె ఉండింది (మార్కు 8:14) శిష్యులు ప్రయాణమై బయల్దేరిన ప్రతిసారి వారితో కూడ రొట్టెలు తీసికొని వెళ్లుట వాడుకయై యుండినదని ప్రయోగింపబడిన భాష ధ్వనించుచున్నది (10:9, 10పై గల వ్యాఖ్యానము చూడు).

**వచనము 6. చూచుకొనుడి, పరిసయ్యులు సద్దూకయ్యులు అను వారి పులిసిన పిండిని గూర్చి జాగ్రత పడుడని** యేసు తన శిష్యులతో చెప్పాడు. మత్తయి వ్రాసిన సువార్తలో ఇంతకు మునపు, "పులిసిన పిండి" యొక్క స్వభావము గూర్చి ప్రభువు ఒక ఉపమానము చెప్పాడు (13:33పై గల వ్యాఖ్యానము చూడు). పులిసిన పిండిని గూర్చిన అలంకార భాష తరుచుగా ప్రజలను ప్రభావితము చేయుచు విస్తరించుచుండిన చెడును సంకేతించుటకు ఉపయోగింపబడినది (1 కొరింథీయులకు 5:6-8; గలతీయులకు 5:7-9). యేసు పరిసయ్యులను మరియు సద్దూకయ్యులను గలిలయలోనే విడచిపెట్టి వెళ్లిపోయినప్పటికిని, వారు యూదా ప్రజలపై చూపిన వ్యతిరేకార్థక ప్రభావము గూర్చియే ఆయన యింకను ఆలోచించుచుండెను. ఈ వర్గములకు సంబంధించిన సభ్యులు దేవుని యందు గాక తమ్మునుతామే, సొంత జ్ఞానమును, శక్తిని నమ్ముకొనుటకు ఉన్ముఖులై యుండిరి. వారు యేసును తృణీకరించి, ఆయన చేసిన సూచక క్రియలను ఎగతాళి చేసారు. తత్ఫలితంగా, వారు ప్రజలకు ఒక అడ్డుబండగా నిలిచారు.

12వ వచనంలో, పరిసయ్యులు మరియు సద్దూకయ్యులు అనువారి "బోధ" "పులిసిన పిండి" యై యున్నదని నిర్వచింపబడింది. లూకా వ్రాసిన సువార్తలో, "పులిసిన పిండి" "వేషధారణ"తో సంబంధముగలదై యున్నది (లూకా 12:1). యూదా నాయకుల వేషధారణను యేసు ఇతర వాక్య భాగములలో ఇంకా ఎక్కువ జాగ్రత్తతో వర్ణించాడు.

వారు “వేషధారులై” యుండిరని కొండ మీద ప్రసంగములో, యేసు “శాస్త్రులను మరియు పరిసయ్యులను” ఖండించుచు (5:20), వారి దానధర్మములు, ప్రార్థనలు, మరియు ఉపవాసములు కేవలము మనుష్యులను సంతోషపెట్టుటకే చేయబడినవని కూడ చెప్పాడు (6:1–18). మార్కు 12:38–40లో యేసు. వారికి బోధించుచు నిట్లనెను,

> శాస్త్రులనుగూర్చి జాగ్రత్తపడుడి. వారు నిలువు టంగీలు ధరించుకొని తిరుగుటను, సంతవీధులలో వందనములను సమాజమందిరములలో అగ్రపీఠములను, విందులలో అగ్రస్థానములను కోరుచు విధవరాండ్ర యిండ్లు దిగమ్రింగుచు, మాయవేషముగా దీర్ఘ ప్రార్థనలు చేయుదురు. వీరు మరి విశేషముగా శిక్ష పొందుదురనెను.

మత్తయి 23:1–7లో వ్రాయబడియున్నట్లు యేసు చేసిన తీవ్రమైన ఖండన ప్రకటనలు శాస్త్రులతోపాటు, పరిసయ్యులను కూడ నిర్దిష్టముగా పేర్కొనుచున్నవి. 23వ అధ్యాయంలోని మిగిలిన వచనాలన్నిటిలో, యేసు వారి వేషధారణను బయలుపెట్టాడు (23:13–15, 23, 25, 27, 29).

## శిష్యుల తప్పుడు అవగాహన (16:7–10)

**[7]కాగా వారు–మనము రొట్టెలు తేనందున గదా (యీ మాట చెప్పెనని) తమలో తాము ఆలోచించుకొనుచుండిరి. [8]యేసు అది యెరిగి–అల్పవిశ్వాసులారా–మనయొద్ద రొట్టెలు లేవని మీలో మీరెందుకు ఆలోచించుకొనుచున్నారు? [9]మీరింకను గ్రహింపలేదా? అయిదు రొట్టెలు అయిదువేలమందికి పంచిపెట్టినప్పుడు ఎన్ని గంపెళ్లు ఎత్తితిరో అదియైనను [10]ఏడు రొట్టెలు నాలుగు వేలమందికి పంచిపెట్టినప్పుడు ఎన్ని గంపెళ్లు ఎత్తితిరో అదియైనను మీకు జ్ఞాపకము లేదా?**

**వచనము 7.** యేసు హెచ్చరికను శిష్యులు అపార్థంచేసికొన్నారు; వారు **రొట్టెలు తీసికొనిరానందుకు** ఆయన వారిని కోపముతో మందలించుచుండెనని వారనుకొన్నారు. అయితే, ఆయన పలికిన పలుకులు ఆయన తన శిష్యులకు నేర్పించ నెంచినది అంతకంటె ఎక్కువ ప్రాముఖ్యమైన ఆధ్యాత్మిక పాఠముండినది, కాని ఐహిక విషయాలు శిష్యుల అవగాహనకు అడ్డుపడినవి.

**వచనములు 8–10.** శిష్యుల అపార్థము, ఆయన వారి **అల్పవిశ్వాసమును** గూర్చి వారిని గద్దించుటకు ఒక చక్కని అవకాశమయ్యింది. యేసు తన శిష్యబృందము విషయంలో “అల్పవిశ్వాసులారా” అను సార్థక గుణవాచకమును తరుచుగా ఉపయోగించాడు (6:30; 8:26; 14:31). “అల్పవిశ్వాసము” అవాంఛనీయమైనది, గనుక ఒకరు గొప్ప విశ్వాసము నిమిత్తమైన లక్ష్యమునే కలిగియుండవలెను. ఎంతైనా, ఇది ఖచ్చితంగా “విశ్వాసము లేకుండుట” లేక “మృతమైన విశ్వాసముండుట” (యాకోబు 2:26) కంటే మేలైనదే.

యేసు తన శిష్యుల నడిగిన ప్రశ్నలు ఆయన గద్దింపును తీవ్రతరంచేసాయి: **మీరింకను గ్రహింపలేదా లేక మీకింకను జ్ఞాపకములేదా?** మార్కు 8:17, 18లో ఈ ప్రశ్నలు కొంచెము విపులీకరింపబడి యున్నవి: “మీరింకను గ్రహింపలేదా? వివేచింపలేదా? మీరు కఠిన హృదయము గలవారై యున్నారా? మీరు కన్నులుండియు చూడరా? చెవులుండియు వినరా? జ్ఞాపకము చేసికొనరా?”

ఆయన చేసిన రెండు అద్భుతకార్యములను యేసు వారికి గుర్తుచేసాడు: ఒకటి, **ఐదు వేల మందికి** ఆహారము పెట్టుట (14:15-21), రెండవది **నాలుగు వేల మందికి ఆహారము పెట్టుట** (15:32-39). ఈ అద్భుత కార్యముల మధ్య గల తారతమ్యము కూడియుండిన జనసమూహము యొక్క జనసంఖ్యనుబట్టి మాత్రమే కాదు, కాని వడ్డింపబడిన **రొట్టెల** సంఖ్యనుబట్టి (ఒకసారి **ఐదు**, మరొకసారి **ఏడు**) కూడ గుర్తింపబడినది. అంతమాత్రమేగాక, ఒకసారి మిగిలిన ముక్కలు ఎత్తబడిన **పన్నెండు గంపలు** (*kophinos*) మరొకసారి మిగిలిన ముక్కలు ఎత్తబడిన **ఏడు పెద్ద గంపలనుబట్టియు** (*spuris*), అవి తారతమ్యముగా నున్నవి.

యేసు వారికి అద్భుతకార్యములను గుర్తుచేయుచుండెను; అదే సమయంలో ఆ పరిస్థితి కేవలము శారీరిక రొట్టె మాత్రమే తక్కువగా ఉండినదను విషయమై ఉండియుంటే, దోనెలో మిగిలియుండిన ఆ ఒక్క రొట్టెను ఆయన వృద్ధిచేసెడివాడే (మార్కు 8:14) లేదా సొంతముగా రొట్టెలు సృష్టించగలిగియుండెడివాడే అని కూడ ఆయన వారికి తెలియజేయుచుండెను. ఆయన జరిపిన చర్చలో, తన శిష్యులు మరి ఎక్కువ విశదమైనది మరియు ముఖ్యమైన పాఠము నేర్చుకొనునట్లు యేసు ఆదేశముల నిచ్చుచుండెను. వారు ప్రధానంగా వారి శారీరిక అవసరముల గూర్చి చింతించుచుండిరి, ఈ అవసరముల నిమిత్తము వారు దేవుని యందు విశ్వాసముంచవలెనని ఆయన వారికి ఆజ్ఞాపించాడు. వారు అసలైన విషయాలు, అనగా దేవుని నుండి వచ్చు అసలైన బోధ గూర్చిన దృక్పథమును కోల్పోయారు (6:33 చూడు).[1]

## యేసు హెచ్చరిక పునరావృతమగుచున్నది (16:11, 12)

**11నేను రొట్టెలనుగూర్చి మీతో చెప్పలేదని మీరెందుకు గ్రహింపరు? పరిసయ్యులు సద్దూకయ్యులు అనువారి పులిసిన పిండినిగూర్చియే జాగ్రత్తపడుడని చెప్పెను. 12అప్పుడు రొట్టెల పులిసిన పిండినిగూర్చి కాదుగాని పరిసయ్యులు సద్దూకయ్యులు అనువారి బోధను గూర్చియే జాగ్రత్త పడవలెనని ఆయన తమతో చెప్పెనని వారు గ్రహించిరి.**

**వచనములు 11, 12.** అటుతరువాత ఆయన, **నేను రొట్టెలను గూర్చి మీతో చెప్పలేదని మీరెందుకు గ్రహింపరు**? అని వారిని ప్రశ్నించాడు. శిష్యులు అసలైన అర్థాన్ని అవగాహన చేసుకొన్నారని రూఢిపర్చుకొనుటకు, **పరిసయ్యులు మరియు సద్దూకయ్యులు** అనువారి పులిసిన పిండిని గూర్చిన తన హెచ్చరికను యేసు పునఃప్రసక్తిగావించాడు. ఈ సందర్భములో, ఈ వర్గమునకు చెందినవారి **బోధను గూర్చి** ఆయన మాటలాడుచుండెనని వారు గ్రహించారు (16:1, 6పైగల వ్యాఖ్యానము చూడు). ఒకడు నైతిక న్యాయప్రమాణమునుబట్టియే దేవుని యెదుట నీతిమంతుడుగా తీర్చబడునను పరిసయ్యుల వాదము, నిజాయితీలేని రాజకీయ కార్యకలాపముల ద్వారా ధనము సంపాదించుకొనుచుండిన సద్దూకయ్యుల విధానము, నీతిమంత్వమును సాధించుటకు ఎన్నడును ప్రయోగింపబడలేకుండిన రెండు దుష్ట చర్యలై యుండినవి.[2] మార్కు వ్రాసిన సువార్తలోగల సంబంధిత వాక్యభాగము సద్దూకయ్యుల కంటె ఎక్కువగా హేరోదును సూచించుచున్నది (మార్కు 8:15). సూచక క్రియను చూపించుమని కోరుచుండిన ఈయన సద్దూకయ్యుల వలెనే క్రీస్తును తృణీకరించాడు (లూకా 23:8-12).

సూచనలు

[1]Donald A. Hagner, *Matthew 14-28*, Word Biblical Commentary, vol. 33B (Dallas: Word Books, 1995), 460. [2]Robert H. Mounce, *Matthew*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 159.




**గలిలయ సముద్రమునకు సమీపమున నుండిన పట్టణములను చూపించుచున్న యేసు కాలము నాటి పాలస్తీనా దేశ పటము**